**కథ**

# మండే సూర్యుడు

**ఇంటి ముందు ఆటో ఆగిన చప్పుడు అవడంతో వరండాలో పేపరు తిరగేస్తున్న రామానుజం మాష్టారు తలెత్తి చూశారు.**

**సుమారు ఏభై అయిదేళ్ళ వ్యక్తి, భార్య, పధ్నాలుగేళ్ళ కుర్రవాడితో సహా గేటు తెరుచుకుని లోపలకు వస్తుంటే అతడు తన చిన్ననాటి క్లాస్‌మేట్ 'రక్షానందం' అని గుర్తుపట్టేశారు. రక్షానందం సఫారీసూట్‌లో ఉన్నాడు. భార్య వస్తూనే నమస్కరించింది.**

రామానుజంగారు లేచి ఆప్యాయంగా స్నేహితుడిని ఆలింగనం చేసుకున్నారు.

''రారా..ఎంత కాలమైంది చూసి. అమ్మా రోజీ..బాగున్నావా! ఈ బాబెవరు? మనవడా? రండి రండి. కూర్చోండి. అనసూయా! ఎవరొచ్చారో చూడు. వచ్చేటప్పుడు మంచినీళ్ళు పట్రా!'' అంటూ నవారు పట్టెమంచం వాల్చారు రామానుజంగారు.

''నువ్వు ఏమీ మారలేదురా రామూ! అలాగే ఉన్నావు. నేను మాత్రం బాగా లావెక్కాను కదూ!'' అంటూ, మంచినీళ్ళ గ్లాసులతో వచ్చిన అనసూయమ్మగార్ని చూస్తూనే ''బావున్నారా అక్కయ్యా!'' అని పలకరించాడు రక్షానందం.

అనసూయమ్మగారు సమాధానం చెప్పి రోజీని పలకరించి కుశల ప్రశ్నలు వేస్తూ లోపలకు తీసుకుపోయారు.

అన్ని విషయాలు పది నిముషాలపాటు చర్చించిన అనంతరం రక్షానందం అన్నాడు.

''ఒరేయ్ రామూ! నీతో అతి ముఖ్యమైన పని ఉండి వచ్చాను. వీడు నా మనుమడు. పేరు క్రిష్టఫర్. నేను కృష్ణా అని పిలుస్తాను. నువు జిల్లాలో అత్యుత్తమ గణిత ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకున్నావు. వీడిని నీ చేతుల్లో పెట్టడానికి వచ్చాను. నీకు తెలుసుగా నాకు ముగ్గురు మగ పిల్లలు. ఒక ఆడపిల్ల. వీడు అమ్మాయిగారబ్బాయి. అమ్మాయి అల్లుడు యిక్కడే టీచర్లుగా పనిచేస్తున్నారు. వీడి మేనమామలు ముగ్గురూ స్టేట్స్‌లో ఉన్నారు. వీడు లెక్కల్లో పరమ పూర్. వీడినెలాగైనా పదో తరగతి గట్టెక్కించే బాధ్యత నీది. వీడిని వాళ్ళ మేనమామలు బాగా చదువుకుంటే తమతో స్టేట్స్ తీసుకుపోదామని అనుకుంటున్నారు. వీడు లెక్కలంటే యింటరెస్టే చూపించడు. మళ్ళీ సైన్సు, అదీ ఫిజిక్సు బాగా చదువుతాడు. ఎప్పుడూ ఏదో ఒక వస్తువును రిపేర్ చేసి పనిచేసేలా చేస్తుంటాడు. అంత తెలివైనవాడు లెక్కలు జస్ట్ పాసవుతాడంతే. వీళ్ళమ్మకి నాన్నకి వీడంటే పరమ గారం. కొండమీద కోతిని తెచ్చిస్తారు. మొన్న కమ్యూనిటీ హాలులో ఏదో సాహిత్య సభలో ప్రసంగించావట. ఆ వార్త పేపర్లో చూసి నాకు ఫోన్ చేసి రప్పించారు. వాళ్ళ బెంగ అంతా వీడి గురించే. వాళ్ళు ఫోను చేసి చెబితే నేనూ కంగారు పడిపోయాను. నువ్వు యిక్కడ ఉన్నావని చెప్పేసరికి నా నోట్లో తేనె పోసినట్లయింది. వెంటనే బయల్దేరి వచ్చేశాను. వాళ్ళ అమ్మా నాన్న వాడి మీద బెంగను నాకు ట్రాన్స్‌ఫర్ చేసి 'మీరే దిక్కు' అన్నారు. వీడిని నీ చేతుల్లో పెడుతున్నాను. నీదే భారం''

రామానుజం మాష్టారు రెండు నిముషాలు దీర్ఘాలోచనలో మునిగిపోయారు. అనంతరం దీర్ఘమైన నిట్టూర్పు విడుస్తూ అన్నారు.

''ఒరేయ్ ఆనందూ! చేసేది డ్రాయింగ్ మాష్టారి ఉద్యోగమైనా శిల్పిగా, చిత్రకారుడిగా రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఖ్యాతి తెచ్చుకున్నవాడివి నువ్వు. నీకు చెప్పేటంతటి వాడిని కాదుగానీ, లెక్కలు-సైన్సులు రెండు ఒకదానితో ఒకటి పెనవేసుకుపోయిన సబ్జెక్టు.

""Mathematics is the king of all subjects. It is the Queen of all sciences " అన్నాడు మహాశాస్త్రవేత్త.


మీవాడు ఫిజిక్స్ ఎంతో బాగా చదివి లెక్కలు చేయలేకపోతున్నాడంటే ఆ సబ్జక్టు పట్ల అంత విముఖత కలిగేలా ఎవరో భయం ఏర్పరచారతని మనసులో. ఆ భయం పోగొట్టి లెక్కలు నేర్చుకోవడం యింత సులభం అన్న పద్ధతిలో చెబితే చాలు. అతనే కొంత కాలం తర్వాత మనకే లెక్కలు నేర్పుతాడు. లెక్కలంటే నేనూ విపరీతంగా భయపడిపోయినవాడినే. ఎందుకు సాధించలేను అని నన్ను నేను ప్రశ్నించుకుని అభిరుచి పెంచుకుని నేర్చుకున్నాను.

నేను చాలామంది ఉపాధ్యాయుల్ని గమనించాను. ఆల్జీబ్రా అంటే గుండె గాబరా అని టీచరే చెప్పి పిల్లల్ని భయపెడితే దాన్ని నేర్చుకోకుండానే దాని పట్ల భయాన్ని ఏర్పరచుకుంటున్నాడు నేటి విద్యార్థి. పాఠశాలల్లో గణితంలో ఉత్తీర్ణతా శాతం తగ్గడానికి యిదో కారణమనుకుంటా నేను.

'లెక్కలు చాలా కష్టం. నేను కాబట్టి చెప్పగలుగుతున్నాను. అదే మరో మాష్టరైతే మీరీపాటికి నాశనం అయిపోయి ఉండేవారు. కాబట్టి నేను ఏ పద్ధతిలో చెప్పానో ఆ పద్ధతిలోనే చెయ్యండి' అని చెప్పే వేరే మనస్తత్వం గల ఉపాధ్యాయులు ఈరోజు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. ముఖ్యంగా ఈ పద్ధతి ఉన్నది కాన్వెంట్ టీచర్లలో, యింకా ట్యూషన్ సెంటర్స్ నడిపేవారిలో. 'మీ క్లాసు మాష్టారు చెప్పిన పద్ధతీ, నేను చెప్పిన పద్ధతీ రెండూ నేర్చుకోండి. ఆలోచించి చేయగలిగితే మీరు కూడా మరో పద్ధతిలో చేయండి. ఈ మూడు పద్ధతుల్లో మీకు యిష్టమైనదీ, అర్థమైనదీ, తేలికయినదీ అయిన పద్ధతిని బాగా ప్రాక్టీసు చేసి పరీక్షలు చేయండి. మీరే పద్ధతిలో చేసినా పద్ధతి కర్టక్టయితే మార్కులు వేస్తాడు పేపరు దిద్దే మాష్టారు' అని చెప్పే విశాల దృక్పథం ఉన్న ఉపాధ్యాయులు కరువైపోయారు. ట్యూషన్ సెంటర్‌లో ఫీజు కట్టడం వల్లనో ఏమో 'మీరు చెప్పిన పద్ధతిలోనే ఎందుకు చేయాలి? మా ట్యూషనులో ఇలా చెప్పారు యిలా ఎందుకు చెయ్యకూడదూ?' అని టీచర్‌ని ఎదురు ప్రశ్న వేసే యాటిట్యూడ్ ఈనాటి పిల్లలో డెవలప్ అవుతోంది. నేను యిలాంటి ఎదురు ప్రశ్నలు ఎన్నో ఎదుర్కొన్నాను. వాళ్ళ మూర్ఖత్వానికి నా చిరునవ్వే సమాధానం.

అర్థంకాని చోట ప్రశ్నలు వేసి సందేహాలు నివృత్తి చేసుకోవడం విద్యార్థి ప్రాథమిక హక్కు. దానిని వదిలేసి నెగటివ్ యాటిట్యూడ్ డెవలప్ చేసుకుంటే తామెంత నష్టపోతున్నామో వారికి అర్థం కావడం లేదు. నేనూ మొన్న డి.ఎస్.సి కౌన్సిలింగ్‌లోనే ఈ వూరు వచ్చాను. మూడు నెలలైంది.

నీకు తెలుసుగా! నాకు కొంచెం ఓర్పు సహనం ఎక్కువ. ఒకటికి పదిసార్లు చెబుతాను. నా శాయశక్తులా సబ్జక్టుల పట్ల తన భయాన్ని పోగొట్టి అభిరుచి పెంచుకునే ప్రయత్నం చేస్తాను. నేను చెప్పే



ప్రతీ అక్షరం తన భవిష్యత్తు కోసం అని అతను గ్రహించేటంత వరకూ చెప్తాను. అయినా అతనిలో మార్పు లేకపోతే ఆపైన ఒక్క క్షణం భరించను. అందుకు నీకిష్టమైతే రేపే మీ మనవడిని పంపించు. రేపు మంచి రోజు అన్నారు రామానుజంగారు.

''చూడు రామూ! నాకు నీ లాజిక్ అంటే చాలా యిష్టం. ఒక సమస్యని చక్కగా ఆలోచించి పరిష్కరించుకునే తెలివితేటలు నీకు ఉన్నట్టుగా నాకు లేవు. నువ్వేం చేసినా సంతోషమే!'' అంటూ లేచాడు రక్షానందం.

''అప్పుడే ఎక్కడికిరా! భోజనం చేసి వెళ్ళండి'' అన్నారు రామానుజంగారు.

''లేదురా! అందరం చర్చికి వెళ్ళి రావాలి. ఇంట్లో అంతా రెడీగా ఉన్నారు. వీడి పనిమీదే యిటువచ్చాం. ఒరేయ్ కృష్ణా! వెళ్ళి గ్రాండ్‌మాని పిలు'' అన్నాడు రక్షానందం మనవడిని ఉద్దేశించి.

అంతలో అనసూయతోపాటు రోజీ రానేవచ్చింది.

వాళ్ళు వెళ్ళిపోయారు.

క్రిష్టఫర్ తనకు నమస్కారం చేయడంగానీ, కనీసం వెళ్ళేటప్పుడు వెళ్తున్నానని చెప్పడంగానీ చేయకపోగా తాను మాట్లాడుతున్నంతసేపూ నిర్లక్ష్యంగా తనను చూసి కళ్ళెగరేస్తూ, మధ్యమధ్యలో విసుగు ప్రదర్శించడం రామానుజంగారి దృష్టిని దాటిపోలేదు.

ఇతనే కాదు. వందకి ఎనభైమంది ఈవేళ గురువుపట్ల ఈ ధోరణినే ప్రదర్శిస్తున్నారు. విద్యార్థి ఉపాధ్యాయుడిని టీజ్ చేసే సినిమా సన్నివేశాలను సినిమా వ్యాపార ప్రకటనల నిమిత్తం పదే పదే టీవీలలో ప్రదర్శిస్తుంటే నిజ జీవితంలో ఉపాధ్యాయుడంటే విద్యార్థికి చులకనే మరి. లేడీ టీచర్స్, జెంట్ టీచర్స్ లైనేసుకుంటూ ఉంటే విద్యార్థులు అది గమనించి గురువుగారిని టీజ్ చేస్తారు. దాంతో ఆ లేడీ టీచర్ జెంట్ టీచర్‌ని పదిమందిలోను అవమానించి యిదంతా 'షో' చూస్తున్న స్టూడెంట్స్ బుగ్గలు నిమిరి తిప్పుకుంటూ వెళ్ళిపోతుంది. ఇలాంటి చిత్రాలు ప్రదర్శిస్తున్న సినిమా హాళ్ళను నిప్పెట్టి తగలెట్టనంతకాలం ఉపాధ్యాయ లోకం ఈ అవమానాలను చచ్చినట్టు భరించాల్సిందే. తన జరగని అభిప్రాయానికి తనలో తానే నవ్వుకున్నారాయన.

దీర్ఘంగా నిట్టూర్చి కుర్చీలో కూలబడి తిరిగి పేపర్ అందుకున్నారాయన.

**కొత్తపల్లి ఉదయబాబు**

★ ★ ★

''మీ తాతా, నేనూ చిన్నప్పటినుంచీ కలిసి పెరిగాం. మా నాన్నగారు స్వాతంత్ర్యోద్యమంలో పనిచేశారు. సాంప్రదాయపు సంకెళ్ళు తొలగించుకుని కట్టుబాట్లను తెంచుకుని మనమంతా ఒక్కటే అనే నినాదంతో ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాల్లా జనం స్వాతంత్ర్యం కోసం ఉరకలేస్తున్న రోజులవి. మన దేశం గణతంత్ర రాజ్యంగా అయినప్పటికి మేము నాలుగేళ్ళ వయసు వాళ్ళమేమో. మంచితనమే మా కులం. స్నేహమే మా అభిమతం.

మా నుంచి శుచి శుభ్రత వాడు నేర్చుకున్నాడు. పదిమందికీ సహాయపడే మంచి గుణం వాడి నుంచి నేను నేర్చుకున్నాను. కలిసే భోజనం చేసే వాళ్ళం. కలిసే చదువుకునే వాళ్ళం కలిసే నిద్రపోయే వారం. ఆర్థికంగా ఆ రోజుల్లో మేమిద్దరం ఒకే స్థాయిలో ఉండేవారం. మా నాన్నగారు స్వాతంత్ర్యోద్యమ దృశ్యాలన్నీ కళ్ళకు కట్టినట్టు చెబుతుంటే అవలీలగా తెల్లకాగితాల మీద ఆ దృశ్యాలను తనకు వచ్చిన రీతిలో వేసేసేవాడు మీ తాత. అతనిలో అభిరుచిని గమనించి డ్రాయింగ్ నేర్పిస్తే చదువు పూర్తయ్యాక డ్రాయింగ్ టీచర్ ఉద్యోగం వచ్చిందతనికి. నాకు లెక్కల మాష్టారి ఉద్యోగం వచ్చింది. ఉపాధ్యాయుడిగా నా తొలి జీతం ముప్పై రూపాయలు. ఆ తరువాత చాలా కాలం ఒకే స్కూల్లో

పనిచేసాం. ఎప్పుడూ ఒకే చోట పనిచేయడం కుదరదు కాబట్టి తనను తూర్పు గోదావరి జిల్లాకి వేస్తే, నన్ను పశ్చిమ గోదావరి జిల్లాకు వేశారు. విడిపోయినా మా మధ్య అనుబంధాలు మరింత పెరిగాయి. మీ మామయ్యలు నా దగ్గర కొంతవరకు చదువుకున్నారు. మా పిల్లలతోపడి మా యింట్లోనే ఆడుకునే వారు. కష్టపడి చదువుకున్నారు. ఈవేళ స్టేట్స్‌కు వెళ్ళారు. మీ అమ్మ కీచు గొంతుతో ఎస్. జానకి పాటలన్నీ పాడేది. ఆ పాటలకి స్టెప్పు వేసేది. కష్టపడి చదివి టీచరయ్యింది. మీ అమ్మ పేరంటే నాకు చాలా యిష్టం. 'జాస్మిన్'. నాకు ఆ పూలంటే చాలా యిష్టం.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే అటువంటి ఉన్నత కుటుంబంలో నుంచి వచ్చిన నువ్వు కూడా అటువంటి పొజిషన్లోకి రావాలంటే మనకు ఏది కష్టమో దాని మీద దృష్టి సారించాలి. సబ్జక్టును చూసి మనం భయపడకూడదు. మనని చూసి 'యింక ఈ అబ్బాయి చదవడానికి మన దగ్గరేమీ లేదే' అని సబ్జక్టు భయపడాలి. అంటే అంత క్షుణ్ణంగా చదవాలన్న మాట. నీకు ఏది అర్థం కాకపోయినా ధైర్యంగా అడుగు. అసలు భయం అన్న పదాన్ని నీ డిక్షనరీ నుంచి చెరిపేయి. అర్థం కాకపోతే 'యింకోసారి చెప్పండి సార్' అను. ఎన్నిసార్లయినా చెబుతాను. నువ్వు ఏకాగ్రతగా నేర్చుకుంటే నెలరోజుల్లో నాలుగు అధ్యాయాలు పూర్తిచేస్తాను. సరేనా కృష్ణా!'' అన్నారు రామానుజంగారు క్రిష్టఫర్ భుజం మీద చేయి వేసి.

''నన్ను క్రిష్టఫర్ అనే పిలవండి. కృష్ణా అని మా తాతగారొక్కరే పిలుస్తారు. యింకెవరు పిలిచినా పలకను'' అన్నాడు క్రిష్టఫర్ తొణుకుబెణుకు లేకుండా.

రామానుజంగారు నవ్వారు. ''సరే అయితే!'' అంటూ సబ్జక్టు చెప్పడం ప్రారంభించారు.

మరుసటిరోజు క్రిష్టఫర్ యిచ్చిన హోమ్‌వర్క్‌ను చక్కగా సాల్వ్ చేసి తీసుకువచ్చాడు. కానీ అతని హేండ్‌రైటింగ్ ఘోరాతిఘోరం. కండచీమలకు కాళ్ళు విరిచి తలో మూలా విరిచేసినట్టు పదానికి పదానికి మధ్య ఖాళీ లేదు. అక్షరానికి తలకట్టు ఎడమవైపునకి, ఒత్తులు తరువాత అక్షరం క్రిందకి రాసేసాడు. నిజం చెప్పాలంటే ఆ పేజీ మున్సిపాలిటీ చెత్తకుండీలా అనిపించింది రామానుజంగారికి.

అతను చేసిన ఒక లెక్కను ఎంత అందంగా ఎంత పొందికగా సోపానాల ప్రకారం ఎంత చక్కగా చేయవచ్చో చేసి చూపించారు రామానుజంగారు. అంతక్రితం రోజు తను చెప్పిన బేసిక్ ఫండమెంటల్స్ అతనికి ఎంతవరకూ అర్థమయ్యాయో అతని చేతే తిరిగి చెప్పించారు. చెప్పలేకపోయిన చోట తనే సరిచేసారు. హోమ్‌వర్క్ ప్రతీ లెక్కనూ దిద్ది పబ్లిక్‌లో అలా చేస్తే తానయితే ఎన్ని మార్కులు వేస్తారో అలా మార్కులు వేసి చూపించారు.

''చూడు. ఈ లెక్కకు నాలుగు మార్కులకి మూడున్నరే పడ్డాయి. అంటే యింకా అర మార్కు లోపం నీలో ఉందన్నమాట. అది సరిచేసుకుని చేస్తే నాలుగుకు నాలుగు మార్కులూ పడతాయి. అలా ప్రతీ పెద్ద లెక్కనుంచి ఆబ్జెక్టివ్ టైపు వరకూ ప్రతీ లెక్కలోనూ ఏ లోపం లేకుండా చేస్తే వందకు వంద మార్కులు సంపాదించడం అనేది లెక్కల సబ్జక్టులోనే సాధ్యం. ముందు నువ్వు నీ రాత మార్చుకోవాలి. లేదా నీ తల రాతే మారిపోయి ఎనభై మార్కులు వచ్చే చోట నలభై మార్కులు కూడా రావు. నువ్వు రాసేది ఆ పేపరు దిద్దే సారుకు అర్థం కావాలి కదా! అర్థం అయిందా క్రిష్టఫర్?''

క్రిష్టఫర్ తలవూపాడు.

మరునాడూ అదే రైటింగ్‌లో లెక్కలు చేసుకొచ్చాడు.

అతనిలో మార్పు వచ్చేటంత వరకూ రోజూ తనే ఒక లెక్క అందంగా చేసి యివ్వడానికి నిర్ణయించుకున్నారు రామానుజం మాష్టారు. నిజానికి క్రిష్టఫర్ చాలా తెలివైనవాడు.

సబ్జక్టు అంటే భయం పోయే విధంగా చెప్పిన తీరుకో, ప్రతీరోజూ అంతక్రితం చెప్పిన బేసిక్ నాలెడ్జిని పునరావృతం చేయడం వలనో, ఏకాగ్రతతో నేర్చుకోవడం వలనో క్రిష్టఫర్ నెలరోజుల్లోనే నాలుగు అధ్యాయాలు పూర్తి చేశాడు. కానీ రైటింగ్ ఏమాత్రం మారలేదు. రెండుని ఏడులా, నాలుగుని తొమ్మిదిలా, సున్నని ఆరులా యిలా అంకెలు వేయడంలో నిర్లక్ష్యం.

''ఇది నాలుగా తొమ్మిదా?'' అంటే లెక్కనోసారి పరిశీలించి ''నాలుగే'' అనేవాడు. అదే మరో లెక్కలో 'తొమ్మిది' అనేవాడు.


దాంతో రామానుజంగార్కి తిక్కరేగేది. బలవంతంగా కోపాన్ని దిగమింగుకునేవారాయన.

ఇలా కాదని ఆరోజు ఆయన క్రిష్టఫర్‌తో యిలా అన్నారు.

''చూడు క్రిష్టఫర్! నన్ను కృష్ణా అని మా తాతగారొక్కరే పిలుస్తారు. మీరు క్రిష్టఫరే అని పిలవండి అని నాకు ఒక్కసారే చెప్పావు. నేను నీ చేత తిరిగి చెప్పించుకునే అవకాశం యివ్వలేదు. అప్పటినుంచీ క్రిష్టఫర్ అనే పిలుస్తూ వచ్చాను. కానీ నీ రైటింగ్ మార్చుకోమని యివాళ్టికి ముప్పైసార్లు చెప్పాను. అయినా నా మాట వినలేదు. ఈ

## కొత్తదనం

**సినిమా ఇండస్ట్రీలో ఊర్మిళ అంటే ఎంతో క్రేజ్ అందరికీ. రంగీలా నుంచి ఈమధ్య విడుదలై జాతీయస్థాయిలో ప్రాధాన్యం పొందిన 'భూత్' వరకూ అన్ని చిత్రాల్లో ఆమె నటన అందర్నీ అలరించింది. 'భూత్' చిత్రంలో ఆమె నటన అందరి ప్రశంసలూ పొందింది. ఇప్పుడామె నటించిన తెహజీబ్, పింజార్‌లలో కూడా ఇలాంటి పెర్ఫార్మెన్స్ ఉంటుందంటున్నారు. చాలాకాలానికి ఆమెలో మంచి పరిణతి వచ్చిందని ఆమె అభిమానులు సంతోషపడుతున్నారు. ఏది ఏమైనా ముమ్ముందు ఊర్మిళ నటనలో మరింత కొత్తదనం కన్పిస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు సినీజనం.**



లెటర్ మీ నాన్నగార్కి చూపించు'' అంటూ ''నాలుగవ నంబరు కాపీబుక్ కొని పంపితే మీవాడి చేత కాపీ రైటింగ్ రాయిస్తాను. రైటింగ్ బాగుండక పోతే సూనికి సగం మార్కులు తగ్గిపోతాయి'' అన్న భావం వచ్చేలా స్పష్టంగా రాసి యిచ్చారాయన.

క్రిష్టఫర్ తలెగరేసి నిర్లక్ష్యంగా దాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

**ప్రీతీ బెస్ట్‌ఫ్రెండ్**

**'కోయీ మిల్ గయా' సినిమాలో ప్రీతీజింతా చాలా బాగా నటించిందంటూ చిత్రం ప్రివ్యూలో కితాబులు రావడంతో ప్రీతీకి ఎంతో ఆనందంగా ఉంది. 'ఈ సినిమాలో హృతిక్‌తో కలిసి చాలా సహజంగా నటించాను. కొన్ని లవ్ సీన్స్‌లో బాగా ఇమిడిపోయాం. హృతిక్‌లోని టాలెంట్, లవ్లీనెస్ నాకు బాగా అర్థమయ్యాయి. అసలు నేనలా నటిస్తానని అసలనుకోలేదు. నాకు ఇకనుంచి హృతిక్ బెస్ట్‌ఫ్రెండ్. ఇండస్ట్రీలో రాకముందునుంచీ బాబీడియోల్, హృతిక్ నాకు బాగా తెలుసు. ఇక్కడికొచ్చాక వారితో ఫ్రెండ్‌షిప్ నాకు ఇప్పటికీ మధురానుభూతి' అని చెబుతున్న ఈ సినిమాలో రొమాన్స్‌తో పాటూ మంచి మానవతా విలువలున్నాయంటోంది ప్రీతీ.**

★ ★ ★

మరునాడు క్రిష్టఫర్ ఏ విధమైన మార్పూ లేకుండా అలాగే హోమ్‌వర్క్ చేసుకువచ్చాడు.

''కాపీ రైటింగ్ బుక్ ఏదీ?'' అడిగారాయన తీవ్రమైన కంఠ స్వరంతో.

ఆ తీవ్రతకు భయపడిన క్రిష్టఫర్ బిక్కమొగం వేసుకుని ''తేలేదు'' అన్నాడు. ఆ ముఖం చూసేసరికి జాలితోపాటు నవ్వు కూడా వచ్చిందాయనకు. కొంతమంది పిల్లలు ఏడుస్తుంటే బహు ముద్దొస్తారు.

''మీ నాన్నగార్కి ఉత్తరం చూపించావా!''

''....''

''నిన్నే! మీ నాన్నగార్కి ఉత్తరం చూపించావా అని అడుగుతున్నాను''

''లేదు''

అంతే! విపరీతమైన కోపం వచ్చిందాయనకు. సహనానికీ ఒక హద్దు ఉంటుంది కదా! చేతిలోని హోమ్‌వర్క్ పుస్తకాన్ని బలంగా క్రిష్టఫర్ మొహంకేసి కొట్టారు.

''నువ్వు అన్నం తింటున్నావా గడ్డి తింటున్నావా? అసలు చీమూ నెత్తురూ ప్రవహిస్తున్న శరీరమేనా నీది? నెల రోజుల నుంచీ చూస్తున్నాను. మనం చదువు నేర్చుకునే మాష్టారికి కనీసం 'గుడ్ మార్నింగ్' చెప్పలేని నీ బోడి చదువు ఎవరికోసం? రేపు ఎవరైనా పెద్దలు మీ యింటికి వస్తే అలాగే ప్రవర్తిస్తావా? చదువుకి సంస్కారం తోడైనపుడే ఆ చదువు పరిమళం ఉన్న పూవులా రాణిస్తుంది. నీ అభివృద్ధి కోసం యిక్కడ నా ప్రతీ క్షణం వెచ్చిస్తూ నీ చేతి రాత మార్చుకొమ్మని నెలరోజుల నుంచి పోరుతూ ఉంటే ఏమిటి నీ మొండితనం? యింతకాలం నా స్నేహితుడి మనవడివని ఉపేక్షించాను. రేపటినుంచి నువ్వు ట్యూషన్‌కు రాకు. మనిషి జన్మ అంటూ ఎత్తితే, నీ బ్రతుక్కి పౌరుషం అంటూ ఉంటే నీ చేతిరాత మార్చుకుని అప్పుడు కనిపించు.



మేనమామలు అమెరికాలో ఉంటే నువు అమెరికా వెళ్ళవు. ఆ యోగం మన ముఖాన రాసి ఉండాలి. ఒక మాట వంద సార్లు చెప్పించుకునే నీలాంటి వాళ్ళకన్నా మా యింట్లో పెంచుకునే కుక్కనయం. తెలివితేటలు ఉండగానే సరికాదు. వాటిని సద్వినియోగ పరుచుకుంటేనే ఏ మనిషైనా రాణించేది. నీ జీవితంలో నువు అనుకున్నది సాధించలేకపోయావూ అంటే అది కేవలం నీ మొండితనం, నిర్లక్ష్యం వల్లనే. అవి వదిలించుకుంటే మనిషివి అవుతావు. లేకపోతే అడవి జంతువుకన్నా హీనమవుతావు. వెళ్ళు. యింకెప్పుడూ మా యింటికి రాకు. మీ నాన్నగారిని సాయంత్రం నాకు వచ్చి కనిపించమను. ఈ మాట చెప్పడం మర్చిపోయావో మీ యింటికి వచ్చి మరీ నిన్ను తంతాను. జాగ్రత్త!'' నాలుగు గోడలు ప్రతి ధ్వనించేలా అరిచిన ఆయన అరుపులకు క్రిష్టఫర్ గుడ్ల నిండా నీళ్ళు కుక్కుకుంటూ వెక్కుతూ పుస్తకాలు సర్దుకుని 'గుడ్‌ఈవినింగ్ సార్' అని శాల్యూట్ చేసి వెళ్ళిపోయాడు. అనసూయమ్మగారు భయపడుతూనే వచ్చి భర్తకు చల్లని మజ్జిగ అందించారు.

★ ★ ★

సుమారు ఎనిమిది సంవత్సరాల తర్వాత- రామానుజం మాష్టారు రిటైరయ్యారు.

తనకున్న విద్యను పదిమందికి అందించాలనే ఉద్దేశ్యంతో తాను రిటైరైన పాఠశాలలో రోజూ ఉదయం ఒక గంట గణితం బోధించడం అలవాటుగా పెట్టుకున్నారు. వేద గణితం నుంచి వేగ గణితం వరకూ అనేక సమస్యలని అతి తక్కువ వ్యవధిలో సాధించే తేలిక పద్ధతులను ఉదాహరిస్తూ శ్రీనివాస రామానుజన్, లీలావతి, శకుంతలా దేవి మొదలైన శాస్త్రవేత్తల జీవితాలలోని ముఖ్య ఘట్టాలను వివరిస్తూ బోధిస్తుంటే, గణితం పట్ల నిద్రావస్థలో ఉన్న విద్యార్థులు సైతం ఆయన క్లాసును ఒక్కరోజు కూడా మానకుండా హాజరవుతున్న విధానం చూసి సిగ్గుపడి ప్రస్తుతం బోధిస్తున్న గణిత ఉపాధ్యాయులు తాము కూడా ఆయన పాఠం శ్రద్ధగా వినే స్థాయికి చేరుకున్నారు.

ఆరోజు అప్పుడే క్లాసు ముగించి యింటికి వచ్చారాయన.

ఇంటి ముందు ఆగిన కారులోంచి దిగిన క్రిష్టఫర్ వెనుక అతని తండ్రి మోజెస్, తల్లి జాస్మిన్‌లను చూస్తూనే స్వాగతించారాయన.

అతిథి మర్యాదలు, కుశల ప్రశ్నలు అయ్యాక మోజెస్ అన్నాడు.

''అంకుల్! వీడు క్రిష్టఫర్, గుర్తుపట్టారా! అమెరికాలో సాఫ్ట్‌వేర్ యింజనీర్‌గా మన యిండియాలో ఓ ప్రైవేట్ కంపెనీ తరపున 18 మాసాల ట్రైనింగ్‌కు సెలక్ట్ అయ్యాడు. యిదంతా మీరు పెట్టిన భిక్ష. వాడిని ఆశీర్వదించండి''

''చూడండి డాడీ. ఆయన నాకు నెల రోజులు మాత్రమే చదువు చెప్పారు. ఏడేళ్ళు నేను కష్టపడి చదువుకున్నాను. ఆయన నాకు భిక్షపెట్టడమేమిటి? యిదంతా నా స్వయంకృషి. ఆయన ఆశీర్వాదం నాకేం అవసరం లేదు. మీరు రమ్మన్నారని మీ వెనుక వచ్చానంతే!'' క్రిష్టఫర్ మాట పూర్తి కానేలేదు.

బలమంతా ఉపయోగించి మోజెస్ చాచి కొట్టిన చెంప దెబ్బకి క్రిష్టఫర్- రామానుజం మాష్టారి కాళ్ళమీద పడ్డాడు సరిగ్గా.

ఊహించని ఆ పరిణామానికి అక్కడ అందరూ నిర్ఘాంతపోయారు.

''లే బాబూ! లే! ఎవరివల్లనైనా కానీ, నువు ప్రయోజకుడివయ్యావు. నాకు అంతే చాలు! కానీ మోజెస్! వయసు వచ్చిన పిల్లల్ని యిలా పదిమంది లోనూ కొట్టుకోవడం మన పరువు ప్రతిష్టలను దిగజార్చుకున్నట్టవుతుందయ్యా!'' అంటూ క్రిష్టఫర్‌ని లేపారు. క్రిష్టఫర్ యింకా తేరుకోనే లేదు. తన జీవితంలో తండ్రి కొట్టిన మొదటి దెబ్బ. అదీ తనకిష్టంలేని మాష్టారి ముందు. ఆ షాక్‌లోనే ఉన్నాడింకా!

ఆవేశం కట్టలు తెంచుకున్నట్టుగా అన్నాడు మోజెస్.

''మూర్ఖుడా! ఎవరితోరా! ఎవరితోరా నువ్వు మాట్లాడుతున్నావు? ఆయన ఎవరనుకుంటున్నావు? మా యింటిల్లిపాదికీ విద్యాభిక్ష పెట్టిన మహానుభావుడు.

మాష్టారూ! మీకు గుర్తుండకపోవచ్చు. మీరు నిడదవోలులో పనిచేసినప్పుడు మూడేళ్ళపాటు నేను మీ దగ్గర ట్యూషను చదివాను. ఆనాడు మీరు చెప్పకపోయి ఉంటే నేను పదో తరగతి పాసయ్యేవాడిని కాదు. మా బావమరుదులు మీ దగ్గర చదివారు. ఆ కృతజ్ఞత మా అందరికీ ఉంది. వీడికి చిన్నప్పటినుంచీ వాళ్ళమ్మ తన గారంతో పాడుచేసింది.

ఒక్కగానొక్క కొడుకు కావడంతో నేనూ కోప్పడినా తరువాత సర్దుకుని దగ్గరకు తీసుకునేవాడిని. అలా వాడికి అడిగిందల్లా కొనిచ్చి మేమే వాడికి పెంకితనం, మొండితనం నేర్పేశాం.

మీ దగ్గర చదివిన నెలరోజులలో వీడిలో చాలా మార్పు వచ్చింది. మేము వూహించినదానికన్నా ఎక్కువ అర్థం చేసుకునేలా చెప్పగలిగిన మిమ్మల్ని మనసులో అభినందించకుండా ఉండలేకపోయాం. ఆరోజు మీరు తనని తిట్టి వెళ్ళిపొమ్మన్నారని చెప్పాడు. వాళ్ళమ్మ ససేమిరా వాడిని మీ దగ్గరకు పంపనంది. నాకు మీరు తెలుసు. నా అదృష్టం బాగుండి అత్తయ్య మామయ్య అప్పుడే స్టేట్స్ పిల్లల దగ్గరకు వెళ్ళారు.

ఆ సాయంత్రం నేను మీ దగ్గరకు వచ్చాను. మీరు మా అబ్బాయిని ఏమన్నారో ఆ మాటలన్నీ ఒక లెటర్‌గా రాయించాను గుర్తుందా సర్! దానిని కంప్యూటర్‌లో ఎన్‌లార్జ్ చేయించి ఫొటో ఫ్రేమ్ కట్టించి వాడిగదిలో వ్రేలాడదీసాను. రోజూ తెల్లవారుఝామున నిద్ర లేపి దానిని చదివిన తరువాతే అసలు చదువు చదివేలా సౌమ్యంగా చెప్పాను. పౌరుషం ఉంటే మాష్టారి మాటలు అన్నీ అసత్యాలు అని ఋజువు చేసి నిన్ను నువ్వు నిరూపించుకో అన్నాను. తనకి నేనే లెక్కలు నేర్పుతానన్నాను.

దాంతో వాడిలో కసిరేగింది. మీ దగ్గర కూర్చుని ఆ వయసులో అన్నీ నేర్చుకుని ఆ నోట్సు తీసుకుని వాడికి అన్నీ నేర్పేవాడిని. వాడు టెన్త్‌లో స్టేట్ రాంక్ తెచ్చుకున్నాడు. అప్పటినుంచీ వాడు వెనుతిరిగి చూడలేదు. మీరు నేర్పిన ప్రతీ మెళకువ వాడికి సోపానమైంది.

ఈవేళ కూడా వాడు యిదంతా తన ప్రతిభే అని విర్రవీగుతూ వచ్చాడు.

ఇది వీడి నుంచే కాదు.. వీడిలా గారాబంగా పెంచిన, పెంచుతున్న మాలాంటి తల్లిదండ్రులందరూ ఎదుర్కొంటున్న సమస్య. పిల్లలను ప్రేమించాలి. లాలించాలి. కానీ 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు కదా! దానిని విస్మరించి చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్నాం సార్. మమ్మల్ని క్షమించండి సార్! మమ్మల్ని క్షమించండి'' అంటూ కొడుకు వైపు తిరిగి అన్నాడు మోజెస్.

''ఇప్పుడు అర్థమైందా? మొక్క నిలదొక్కుకునేటంత వరకేరా తోటమాలి అవసరం. ఆ తరువాత అంతా తన నిర్వాకమే అనుకుంటే అది చాలా పొరపాటు. ఏ తుపాను వచ్చి ఆ వృక్షం నేలరాలినా ఒక కన్నీటి బొట్టు రాల్చేది తోటమాలేరా!

అలాగే ఉపాధ్యాయుడంటే ఎవరనుకున్నావ్? మండే సూర్యుడు. అనుక్షణం జనించే ఆ శక్తి మానవాళి మనుగడకే ఉపయోగపడుతుంది. దానిని ఉపయోగించుకోలేకపోతే అది నీలాంటి వాళ్ళ మూర్ఖత్వం. కానీ సూర్యుడికేమీ కాదే! విద్యార్థులు ఎదురు తిరగడం, టీచర్స్‌ని టీజ్ చేయడం సినిమాలలో చూపిస్తున్నారేమోగానీ నిజమైన ఉపాధ్యాయుడి కోపానికి గురైతే ఏ విద్యార్థి అయినా శలభంలా మాడిపోవాల్సిందే.

ఇప్పుడైనా తెలిసిందా యిదంతా నీ స్వయంకృషో లేక నీలో ఆ అభిరుచి బీజాన్నినాటిన గురువుగారిదో. ఇప్పుడైనా తప్పు తెలుసుకుని మాష్టారి కాళ్ళ మీద పడి క్షమాపణ అడుగు. లేకపోతే సారే చెప్పినట్టు నీ కన్నా కుక్క నయం.

ఇంత చదివినా నీ బ్రతుకు ఆ కుక్క కంటే హీనం. ఊ! ఏం చేస్తావో చెయ్!'' అని హుంకరించాడు మోజెస్.

క్రిష్టఫర్ తనకు తెలియకుండా ధారలుగా కారుతున్న కన్నీటిని తుడుచుకోవాలనే ప్రయత్నంలో అక్కడే కుండలోంచి గ్లాసు నీళ్ళు తీసుకుని ముఖం కడుక్కుని రుమాలుతో తుడుచుకున్నాడు.

వచ్చి మాష్టారి కాళ్ళ ముందు మోకరిల్లి ఆయన పాదాలపై తలవాల్చాడు.

రామానుజం మాష్టారు అతన్ని నెమ్మదిగా లేవనెత్తి తల నిమిరారు.

''మాష్టారు. ఎంతో అహంకారంతో మీపట్ల ఏ విద్యార్థీ ప్రవర్తించనంత అనుచితంగా ప్రవర్తించాను. మీ పట్ల కక్ష పెంచుకున్నాను. నామాట చెల్లుతుందనే గర్వంతో మిమ్మల్ని ద్వేషించాను. ద్వేషించినా, కక్ష పెంచుకున్నా విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుడెప్పుడూ గాయానికి పూసిన నవనీతం లాంటి వాడే అని మీరు నిరూపించారు.

పరోక్షంగా నా అభివృద్ధికి కారణం అయ్యారు. మనస్ఫూర్తిగా క్షమించండి సార్! ప్లీజ్! నన్ను మనస్ఫూర్తిగా క్షమించండి!'' అని వెక్కి వెక్కి ఏడవసాగాడు.




వృద్ధాప్యం వల్లనో, విద్యార్థి పట్ల ఉండే అవ్యాజ అనురాగమో, బిడ్డల పట్ల తండ్రికి ఉండే సహజ ప్రేమ ఫలితమో రామానుజం మాష్టారి కళ్ళు చమర్చాయి.

ఇప్పుడు ఆయన మండే సూర్యునిలా లేరు. నిండు పున్నమి చంద్రునిలా చల్లని చూపులతో క్రిష్టఫర్‌ను ఓదారుస్తూ ఉండిపోయారు.

తెప్పరిల్లిన క్రిష్టఫర్ యిపుడు మాష్టారి కళ్ళకి సరస్సులో వికసించిన కమలంలా కనిపిస్తున్నాడు.

✪